

వివరాలు మెయిన్‌లో

చీకట్లో సాగర్ ఎర్త్ డ్యాం...!


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 11 మే , 2026 | పేజీలు : 06


# 'మెగా జాబ్ మేళా'.. నిరుద్యోగ యువతకు వరం!

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

కుంభం ఫౌండేషన్, ఐబిఎం స్కిల్స్ బిల్ ఆధ్వర్యంలో భారీ ఉపాధి వేదిక

వందలాదిగా తరలివచ్చిన నిరుద్యోగ యువత




**ప్రజాపక్షం/యాదాద్రి :** స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కుంభం ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్లో నిర్వహించిన 'మెగా జాబ్ మేళా' అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఆదివారం జరిగింది. కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి అధ్యక్షతన, ఐబిఎం స్కిల్స్ బిల్ 1 మిలియన్ 1 బిలియన్ సంస్థల సహకారంతో ఈ మేళాను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభించగా, గౌరవ అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**నైపుణ్యాలే విజయానికి సోపానాలు: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత కేవలం డిగ్రీలతో సరిపెట్టుకోకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తోందని, గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

**అంతర్జాతీయ స్థాయి అవకాశాలు: ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**

ముఖ్య అతిథి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఐబిఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయి కంపెనీలలో ఉద్యోగాలు పొందే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. కుంభం ఫౌండేషన్ చేస్తున్న ఈ కృషి నిరుద్యోగులకు వరం లాంటిదని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉపాధి కార్యక్రమాలు నిర్వహించి యువతకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

**సొంత గడ్డపైనే ఉపాధి కల్పనే లక్ష్యం: ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి**

కుంభం ఫౌండేషన్ అధినేత, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి, మన ప్రాంత యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని కోరినట్లు ఆయన వెల్లడించారు.

**వందలాదిగా తరలివచ్చిన అభ్యర్థులు:** ఈ జాబ్ మేళాకు యాదాద్రి భువనగిరి జిల్లా నలుమూలల నుండి వందలాది మంది నిరుద్యోగు లు తరలివచ్చారు. వివిధ బహుళజాతి సంస్థల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కుంభం ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మెన్ తంగెళ్లపల్ల శ్రీ వాణి రవికుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మెన్ ఆవేస్ చిస్తి, నాగరాజు, కృష్ణారెడ్డి, ఐ బి ఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

## యాప్‌లో సాంకేతిక సమస్యలు..

33 ప్రశ్నలతో ప్రజల్లో అయోమయం...లొకేషన్ నమోదు నుంచే చిక్కులు

నేటి నుంచి ఇంటింటికి గణన అధికారులు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** 2027 జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణ విధానం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు ప్రజలే తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ప్రత్యేక లింక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వైబ్ ద్వారా స్వీయ గణన ప్రక్రియ నిర్వహించుకోవచ్చు. ముందుగా తెలంగాణ ఎంపిక చేసి,చిత్ర ధృవీకరణ పూర్తి చేయాలి.అనంతరం కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేసి ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తిచేయాలి. తర్వాత ఇంటి వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, పరిశీలించిన అనంతరం సమర్పించాలి. నమోదు పూర్తయ్యాక హెచ్ అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుంది. దానిని భద్రపరుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మే11 నుంచి ఇంటింటికి వచ్చే గణన అధికారులకు ఆ సంఖ్య చూపిస్తే వారు వివరాలను ధృవీకరిస్తారు. అయితే ఈ ప్రక్రియ సామాన్య ప్రజలకు అంత సులభంగా లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గూగుల్ మ్యాప్‌లో ఇంటి లొకేషన్‌ను గుర్తించి గుర్తు పెట్టాల్సి రావడం (మిగతా 6లో)

## ఎండలో నిరీక్షణ ఎందుకు.. బస్టాండ్ ఉండగా





**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రజలారా ఎండలో ఎందుకు నిలబడుతున్నారు.. నా వద్దకు రండి..చల్లని నీడ ఉంది.. కూర్చునే చోటుంది.. సీటుతో ప్రయాణం ఉంది..ఇదే నకిరేకల్ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులకు మౌన పిలుపు. అన్ని వసతులతో సిద్ధంగా ఉన్నా, ఎక్కువ మంది ఇంకా ఇందిర గాంధీ సెంటర్‌లోనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.నకిరేకల్ బస్టాండ్‌లో ఫ్యాన్లు, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, బస్‌పాస్ కౌంటర్ ఉన్నాయి. పక్కనే హోటళ్లు, దేవాలయం, ప్రభుత్వ పాఠశాల, కళాశాలలు,కోర్టు,త్వరలో వుంది పడకల ఆసుపత్రి, రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉన్నాయి.ప్రయాణికుడికి కావాల్సిన సౌకర్యాలన్నీ ఒకేచోటే ఉన్నాయి.

నకిరేకల్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఈ బస్టాండ్‌నే కొన్ని బస్సుల స్టార్టింగ్ పాయింట్‌గా ఆర్టీసీ ఏర్పాటు చేసింది. సూర్యాపేట డిపో ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ బస్సులు ఉదయం 6, 7 గంటలకు.. మధ్యాహ్నం 2,4 గంటలకు హైదరాబాద్‌కు ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి. సెంటర్‌లో నిలబడకుండా, ఇక్కడి నుంచే సీటుతో ప్రశాంతంగా ప్రయాణం మొదలుపెట్టే అవకాశం ఉంది.

ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను బస్టాండ్‌కు మళ్లించేందుకు ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం నిర్మించాలని పోలీస్ స్టేషన్ స్థానంలో బస్టాండ్ నిర్మించాలని బస్టాండ్ స్థానంలో పోలీస్ స్టేషన్ నిర్మించాలని ఉద్దేశంతో గతంలోనే ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ అంశాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.కొద్దిపాటి ఆటో ఖర్చు తప్పించుకోవచ్చు..కానీ ఎండ,రద్దీ,తొక్కిసలాట తప్పవు. కాస్త ఆలోచిస్తే సౌకర్యం ఎక్కడుందో స్పష్టమవుతుంది. సెంటర్‌లో రద్దీ తగ్గాలంటే.. సెంటర్లో ఆర్టీసీ వాహనాలు ప్రైవేటు వెహికల్స్ నిలపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి, అప్పుడే సెంటర్లో ట్రాఫిక్ నియంత్రణ ఉంటుందని ప్రజల నుండి అభిప్రాయాలు వ్యక్తంఅవుతున్నాయి.



## ఆధ్యాత్మిక వేడుకలతో ప్రజల్లో ఐక్యత, భక్తిభావం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే సంప్రదాయాల పండుగలు, ఆధ్యాత్మిక వేడుకలతో ప్రజల్లో ఐక్యత, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో శ్రీ మల్లిఖార్జున స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖాబాబురావు, మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లిఖార్జున స్వామి కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో శ్రీ మల్లిఖార్జున స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ భువనగిరి నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల పోరం అధ్యక్షులు జక్క రాఘవేందర్రెడ్డి, గ్రామ సర్పంచ్ గోధ రమాదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తిప్పర్తి ఇండియన్ గ్యాస్ బాధితులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/తిప్పర్తి:** మండలంలోని శ్రీలక్ష్మీ మణిదీప్ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ గత రెండు నెలలుగా బుక్ చేసిన గ్యాస్ సిలిండర్లు ఇవ్వకుండా కస్టమర్లను ఇబ్బందులకు గురిచేస్తోందని సిపిఎం మండల కార్యదర్శి మన్నెం భిక్షం,నాయకులు భీమగాని గణేష్ ఆరోపించారు.ఆదివారం ఏజెన్సీ ఎదుట ఆందోళన చేస్తున్న కస్టమర్లను కలిసిన వారు మాట్లాడారు.బుక్ చేసిన ప్రతి ఒక్కరికి వెంటనే గ్యాస్ అందించాలని, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏజెన్సీ నిర్లక్ష్యానికి కారణం తెలుసుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



## ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పట్టణ ఆర్య వైశ్య సంఘ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పట్టణ ఆర్యవైశ సంఘ ఎన్నికల సన్నాహక జనరల్ బాడీ సమావేశం పట్టణ అధ్యక్షులు మంచాల రంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆయన హాజరై మాట్లాడుతూ ఎన్నికలను ఐక్యంగా నిర్వహించేందుకు 20 మంది సభ్యులతో నిర్వహణ కమిటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. సంఘ అభివృద్ధి కోసం ప్రతి సభ్యుడు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి సోమనర్సయ్య, చల్లా లక్ష్మి కాంత్, బండారు రాజా, కర్నాటి కిషన్, తోట శ్యామ్, బొమ్మిడి లక్ష్మి నారాయణ, వెంపటి పురుషోత్తం, బిక్కుమళ్ల ఉపేందర్, రాచర్ల కమలాకర్, స్వామి బుచ్చయ్య, శింగిరికొండ రవీందర్, మీలా వంశీ పాల్గొన్నారు.

## మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కేంద్రంలో మతోన్మాద విధానాల్ని అవలంభిస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎంఎల్ రెడ్‌స్టార్ కేంద్ర కమిటి సభ్యులు మహ్మద్ పాషా తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా తృతీయ మహాసభలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం తాడిత పీడిత ప్రజల్ని మరింత ఇబ్బందులకు గురిచేస్తూ ఆదానీ, అంబానీ వంటి కార్పోరేట్ సంస్థలకు దేశ సంపదను దారాదత్తం చేస్తుందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ డైరెక్షన్‌లో భయానక వాతావరణాన్ని సృష్టిస్తుందని తెలిపారు. గ్యాస్ ఇంధనం ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సైదయ్య, జిల్లా కార్యదర్శి బి. రామచందర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నరేందర్, శివ, శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

## చదువుతోపాటు యోగా అవసరం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికి చదువుతోపాటు యోగా తప్పనిసరి అని తెలంగాణ యోగ ప్రచార సమితి అధ్యక్షులు ఎం. ప్రసాద్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కళ్యాణ మండపంలో గత 15 రోజులుగా వేసవిలో విద్యార్థులకు సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శ్రీవాసవి సేవా సమితి సహకారంతో ఉచితంగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సూర్యాపేట ఉన్నత యోగ శిక్షణ కేంద్రం గురూజీ చాడ పాపిరెడ్డి, శ్రీవాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, బ్రాహ్మణ కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి కట్టెకోల పూర్ణ చందర్ రావులతో కలిసి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో విద్య పోటీ విధానంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని వారికి యోగా, ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ లక్ష్మి, సుదర్శన్ రెడ్డి, గోపారపు రాజు, సోమ ప్రవీణ్ కుమార్, కుంచపర్తి రాజశేఖర్, పోలా లక్ష్మి నారాయణ, బెలిదె శ్రీనివాసు, వెంపటి శబరినాథ్ పాల్గొన్నారు.

## ఆర్ట్ అఫ్ లివింగ్ అవార్డుల ప్రదానం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** గురుదేవ్ శ్రీశ్రీ రవి శంకర్ స్థాపించిన ది ఆర్ట్ అఫ్ లివింగ్ సంస్థ 45 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా భువనగిరికి చెందిన అన్విత రెడ్డి (క్రీడలు), గుర్రాల శ్రీనివాస్(సమాజ సేవ) విభాగలలో అవార్డులను ఇటీవల హైదరాబాద్‌లో బండారు దత్తాత్రేయ చేత అందుకున్నారు. ఆదివారం భువనగిరిలోని ఆర్ట్ అఫ్ లివింగ్ సెంటర్లో వారికి సన్మానం చేయడం జరిగిందని టీచర్ ఉప్పుల రవి తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రతినిధులు చింత బాలయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్ గడ్డం, మోహన్ రెడ్డిలు, యోగ సాధకులు పాల్గొన్నారు.



## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాపక్షం/చివ్వెంల :** ఉపాధి హామీ పనులతో పాటు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని గ్రామ సర్పంచ్ ఉదయశ్రీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చందుపట్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఎండ వేడి తీవ్రతను తట్టుకోవడం కొరకు టెంటు, చల్లటి మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బొడుపుల హరికృష్ణ, వార్డు మెంబర్లు గుయ్యాని సుజాత లక్ష్మణ్, అనంతుల సైదులు, కోడిరెక్క రాజేశ్వరి సైదులు, లలితా దేవేందర్, సిద్దూ రమేష్ పాల్గొన్నారు.



## సమ్మర్ క్యాంపు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** విద్యార్థులు శారీరక, మానసిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు మే 11వ తేదీ నుండి 25వ తేదీ వరకు సమ్మర్ క్యాంపును హుజూర్‌నగర్ పట్టణంలోని పిఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తాతరాజు శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. సమ్మర్ క్యాంపు ద్వారా భవిష్యత్‌లో పిల్లలు కేవలం పాఠ్యాంశాల్లోనే కాకుండా జీవిత నైపుణ్యాలల్లోనూ ముందుకు సాగేందుకు ఇదోక అద్భుత అవకాశమని తెలిపారు. విద్యార్థులకు చెస్, క్యారమ్స్, ఆర్ట్ క్రాఫ్ట్ వాలీబాల్, క్రీడల్లో తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సాధారణ ప్రసవాలతోనే మేలు



**ప్రజాపక్షం/అర్వపల్లి :** తల్లి నవజాత శిష్యులు ఇద్దరు సాధారణ ప్రసవాలతోనే క్షేమంగా ఉంటారని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ నగేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వైద్యశాలలో డాక్టర్ వైద్యసిబ్బందితో కలిసి సాధారణ ప్రసవాన్ని ఇద్దరికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వైద్యశాలలో సాధారణ ప్రసవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. గర్భిణీలు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి ఇబ్బందులకులోను కాకూడదని అన్నారు. రామన్నగూడెం గ్రామానికి చెందిన రమావత్ సంధ్యకు, కోమటిపల్లి గ్రామానికి చెందిన తిరుపతి సౌరమ్మకు సాధారణ ప్రసవం నిర్వహించినట్లు వివరించారు. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారని చెప్పారు. ఆయన వెంట వైద్య సిబ్బంది బి. సునీత, ఏ. మాధవి, ఎన్. కళమ్మ, శైలజ, శోభలు ఉన్నారు.

## వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న గడ్డం సైదులుపై చర్య తీసుకోవాలని సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం రాయిపాడు గ్రామానికి చెందిన మహిళ భట్ట ఉమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన విద్యుత్ లైన్‌మెన్ గడ్డం సైదులు తనను నిత్యం వెంబడిస్తూ వ్యక్తిగత దూషణలకు పాల్పడడంతోపాటు ఇటీవల బ్యాంకుకు వెళ్లిన తనపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై పాలకీడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ గడ్డం సైదులుకు వత్తాసు పలుకుతూ ఫిర్యాదు చేస్తే తీసుకోకుండా కోర్టు ప్రకారం చర్యలు తీసుకుంటా అని జాప్యం చేస్తున్నాడని వాపోయారు. తనను గ్రామంలో ఉండొద్దని వెంబడిస్తూ దుర్భషలాడుతూ నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. తనకు గడ్డం సైదులు నుంచి ప్రాణహాని ఉందని తక్షణమే అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

## 15 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణం

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** 15 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణమని భువనగిరి మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ భువనగిరి నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం భువనగిరి మండలం నందనం గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను తేమ పేరుతో, మాచర్ రావడం లేదని, ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్, మండల సర్పంచ్ ల పోరం అధ్యక్షులు జక్క రాఘ వేందర్రెడ్డి, గ్రామ సర్పంచ్ నాగేల్లి గిరిజ రమేష్ గౌడ్ పాల్గొన్నారు.





## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ

**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు మండల కేంద్రానికి చెందిన సిపిఎం నాయకుడు యాసరని శీను కుమారుని వివాహ వేడుకకు ఆదివారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, సుఖసంతోషాలతో దాంపత్య జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గురిజ రామ చంద్రం,తిరుపారి వెంకటేశ్వర్లు,బొల్గూరి నరసింహ, చాపల శ్రీను,గోస్కొండ లింగయ్య,మందుల పాండు, మునుగోటి దయాకర్,గోపగోని ఉదయ్ పాల్గొన్నారు.

## తల్లిని మించిన దైవం లేదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సృష్టిలో తల్లిని మించిన దైవం లేదని సామాజికవేత్త, పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ అన్నారు. విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మ అన్నారు. అమ్మ ఆలనపాలన చూడాల్సిన కుమారులు, కుమార్తెలు వారి బాధ్యతలను విస్మరించడం బాధాకరమన్నారు. సమాజంలో మహిళల పట్ల వెలుగు చూస్తున్న సంఘటనలు సమాజానికి తలవంపులు తెచ్చే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రమాబాయి, సుధారాణి, బిషప్ తదితరులు ఉన్నారు.

## పి.వి.రావు జయంతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మాలమహానాడు వ్యవస్థాపకుడు స్వర్గీయ పోతుల విగ్నేశ్వరరావు( పీవీ.రావు) 74వ జయంతిని పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాడుగుల శ్రీనివాస్, అంబేద్కర్ రైట్స్ డాక్టర్ జాడి రాజు, మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్, నాయకులు చిలుకూరి అభినవ్, కోడిరెక్క కుమార్, పెరుమాండ్ల జీవన్‌కుమార్, గడ్డం విజయ్‌కుమార్, ఓరుగంటి చంద్రశేఖర్, తాళ్లపల్లి శ్రీను పాల్గొన్నారు.



# మర్రిగూడ మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనంకై ప్రదర్శన



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మర్రిగూడ మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలోని చౌరస్తాలో ప్రజా ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు,రైతులు,సామాజిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుతం మర్రిగూడ మండలం నల్లగొండ జిల్లా పరిధిలో ఉన్నప్పటికీ జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో విలీనం జరిగితే ప్రభుత్వ పరిపాలనా సేవలు ప్రజలకు త్వరగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు.అదేవిధంగా రంగారెడ్డి జిల్లా ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలలో ఒకటిగా నిలిచిందని, హైదరాబాద్‌కు సమీపంగా ఉండటంతో పరిశ్రమలు,ఐటీ కంపెనీలు,రియల్ ఎస్టేట్ రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. మర్రిగూడ మండల భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేయడం అత్యవసరమని ప్రభుత్వాన్ని కోరారు. మర్రిగూడను రంగారెడ్డి జిల్లాలో కలపాలి,మా మండలం అభివృద్ధి కావాలి,యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి,అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భిచ్చానాయక్,రమావత్ ధర్మానాయక్,మారగోని సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** రైతులు పండించిన ధాన్యము కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వము ఘోరంగా విఫలం అయిందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు.ఆదివారం మండలంలోని శివన్నగూడ,ఖుదా బాక్స్ పల్లి,వద్ద కొనుగోలు కేంద్రాలను సందర్శించి మాట్లాడుతూ నెలలు గడుస్తున్న ధాన్యము కొనుగోలు జరపడం లేదని వందల కొద్దీ వడ్ల రాశులను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయని వర్షాల వల్ల ధాన్యం తడిస్తే ఎవరి బాధ్యత వహిస్తారని ప్రభుత్వము మిల్లర్లు కుమ్మక్కై తాలు తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆవేదన చెందారు.మంత్రి పదవి కోసం రాజగోపాల్ రెడ్డి పడుతున్న తిప్పలను ప్రజలు గమనిస్తున్నారని నియోజకవర్గం వర్గములోని సమస్యలను వదిలి మంత్రి పదవి కోసం ఢిల్లీ చుట్టూ తిరగడం మానేసి కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరిగి రైతు బాధితులను ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్,రైతు బంధు మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ,సర్పంచ్ వల్లముల సంతోష్,మాజీ సర్పంచులు ఆయిల్ నరసింహ,దేశిడి సురేందర్ రెడ్డి,ఎడ్ల శ్రీరాములు,మాజీ ఎంపీటీసీలు ఊరి పక్క సరిత నాగేష్,మారగోని వెంకటయ్య యాదవ్,వనమాల మహేష్,ఆంగోత్ హరిప్రసాద్,పాపా చారి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్లు నిర్మించి ప్రమాదాలు అరికట్టాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని నందిపాడు బైపాస్ జంక్షన్ వద్ద తరుచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం నందిపాడు బైపాస్‌నుఆయన పరిశీలించి మాట్లాడారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద తెలుపురంగు మార్కింగ్‌లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల వాహనదారులు అవగాహన లేకుండా వేగంగా వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే అనేక కుటుంబాలు ప్రమాదాల కారణంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్ జంక్షన్ సమీపంలోని వైన్స్ షాపులు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయని, ప్రజల భద్రత కోసం వాటిని ఇతర ప్రాంతాలకు మార్చాలని డిమాండ్ చేశారు. రెండేండ్ల క్రితం ఫ్లై ఓవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని లేనట్లయితే అఖిలపక్షాలతో కలిసి ప్రజా ఉద్యమాలు చేపడ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, రాగిరెడ్డి, బావండ్ల పాండు, గోవిందరెడ్డి, రామారావు, రవి పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

**ప్రజాపక్షం/చివ్వెంల :** సూర్యాపేట డివిజన్ పరిధిలోని సూర్యాపేట, చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్( ఎస్) మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈనెల 12 నుండి జూన్ 3 వరకు పిఎంశ్రీ జడ్‌పిహెచ్‌ఎస్ చివ్వెంల పాఠశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి జి. కళారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ నిర్వహించబడుతుందని తెలిపారు. ఆయా మండలాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఇట్టి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత పాఠశాలలో ఆయా సబ్జెక్టుకు ఉపాధ్యాయులు విధిగా ఈనెల 12 నుండి జూన్ 3 వరకు ఉపాధ్యాయులు సిఎంలలో తమ సేవలను అందించాలని సూచించారు. ఆయా ఉపాధ్యాయులు ఈనెల 11న జడ్‌పిహెచ్‌ఎస్ చివ్వెంల పాఠశాల కోర్స్ కోఆర్డినేటర్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

**ఉచిత వేసవి శిక్షణ శిబిరం...** విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు, వేసవి సెలువులను సద్వినియోగం చేసుకునే వీలు కల్పిస్తూ ఉచిత వేసవి శిక్షణ శిభిరాన్ని పిఎంశ్రీ జడ్‌పిహెచ్‌ఎస్ చివ్వెంలలో ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి కళారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులకు ఇండోర్ గేమ్స్, ఆర్ట్, క్రాఫ్ట్, బ్యూటిషియన్, కంప్యూటర్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లో శిక్షణ అందిస్తారని ఇట్టి శిక్షణ ఈనెల 11 నుండి 25 వరకు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.




## విహెచ్ ఆమరణ దీక్షకు మద్దతు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దేశ వ్యాప్త జనగణనలో కులగణన చేయాలని డిమాండ్‌తో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు చేస్తున్న ఆమరణ దీక్షకు ఆదివారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం జనగణనలో ఎస్సీ, ఎస్టీ కాలంలు పెట్టి ఓబీసీ కాలమ్‌ను పెట్టకపోవడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించుకొని 75 సంవత్సరాలు దాటినా నాటి నుంచి నేటి వరకు బీసీలు అన్యాయానికి గురయ్యారని ఇప్పటికైనా కేంద్రం జనాభా లెక్కలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సరికొండ రామకృష్ణంరాజు, శివరామకృష్ణ, కల్లా నరసింహాగౌడ, కుశలవ, లింగస్వామియాదవ్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాలయాపన తగదు- ముక్కెర



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నెలల తరబడి కాలయాపన చేయడం సమంజసం కాదని టీఎన్‌టీయుసీ అనుబంధం ఫార్ బాయిల్డ్ మోడ్రన్ రైస్, దాల్‌మిల్ వర్కర్స్, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు ముక్కెర అంజిబాబు అన్నారు. కార్మికుల సమస్యలకు పరిష్కారం కోసం ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నెలల తరబడి కాలయాపన చేస్తుండడంతో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కలగడం లేదని అన్నారు. వెంటనే సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పానుగోటి వెంకటేశ్వర్‌రావు, అక్కినపల్లి పిచ్చయ్య, చెరుకుపల్లి సైదులు, రామకృష్ణ, కనకయ్య, వెంకన్న, సుమన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివ రాజ్ గౌడ్‌కు సన్మానం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఆపద సమయంలో విద్యార్థి చదువుకు సహకారం అందించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పచ్చిమట్ల శివరాజ్ గౌడ్ ను ఆదివారం గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. గత సంవత్సరం 2025లో చందుపట్ల గ్రామానికి చెందిన గుర్రం బిక్షపతి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా, విద్యార్థిని అపద సమయంలో ఆ కుటుంబానికి పచ్చిమట్ల శివ రాజ్ గౌడ్ ఆర్థిక సహాయం రూ.20,000 అందించి, చిన్నారి కీర్తనకు వారి స్కూల్ లో 10వ, తరగతి స్కూల్ ఫీజు రూ.50,000 చెల్లించారు. అ సహాయం వమ్ము చేయకుండా విద్యార్థిని కుటుంబ సభ్యులు కృతజ్ఞతా భావముతో పచ్చిమట్ల ని సన్మానించారు. కాగా విద్యార్థి గుర్రం కీర్తన ఇండియన్ మిషన్ స్కూల్ భువనగిరిలోని 10వ తరగతిలో 520 మార్కులు సాధించి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులురాలైనంద నిరుపేద విద్యార్థిని సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో చందుపట్ల గ్రామ మాజీ సర్పంచ్ వల్లందాసు ఆదినారాయణ, విద్యార్థిని తాత గుర్రం రామచంద్రయ్య, గుర్రం విజయ బిక్షపతి, గుర్రం నరసింహులు, గుర్రం ఉపేందర్‌లు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా ఇటీవల నియమించబడిన కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన పులి సులోచనరావు ఆదివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపి, తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేకి పుష్పగుచ్చం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లిక్కి గురవమ్మ వెంకటయ్య, పులి వెంకటేశ్వర్లు, తూమాటి నాగిరెడ్డి, పూర్ణ, కలకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గోడపత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** తెలంగాణ జన సమితి నాలుగో ప్లీనర్‌ని విజయవంతం చేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లా ఎస్‌సి సెల్ కన్వీనర్ బచ్చలకూరి గోపి ప్లీనరీ గోడపత్రికను ఆవిష్కరించారు. ఆదివారం మండలంలోని నూర్జహాన్‌పేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12న హైదరాబాద్‌లో జలవిహార్ నెక్లెస్ రోడ్డు దగ్గర జరుగు ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. పానుగోటి సూర్యనారాయణ, దేవిరెడ్డి శేఖర్ రెడ్డి, లాలు నాయక్, మధు, శంకర్ పాల్గొన్నారు.

## సొంత నిధులతో కల్వర్టు నిర్మాణం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండలంలోని పుల్లాయిగూడెం గ్రామంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా గెలుపు ఓటములకు సంబంధం లేకుండా బీజేపీ జిల్లా కార్యదర్శి తడిసిన మల్లారెడ్డి సొంత నిధులతో కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టారు.పుల్లాయిగూడెం గ్రామంలోని మొర్సు బావి ప్రాంతంలో నివసించే 7 కుటుంబాలు వర్షాకాలంలో చిన్నపాటి వర్షం పడినా వాగు ఉధృతికి ఊరితో సంబంధాలు తెగిపోయి,ఆ కుటుంబాలు అల్లాడిపోయేవి. గత సర్పంచ్ ఎన్నికల సమయంలో మల్లారెడ్డి దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. ఆయన వారికి హామీ ఇచ్చారు. సొంత నిధులతో ప్రభుత్వ నిధుల కోసం ఆశించకుండా,గ్రామస్తులు మళ్లీ ఇబ్బంది పడకూడదని మల్లారెడ్డి సంకల్పం తీసుకున్నారు. సుమారు లక్ష రూపాయల తన సొంత నిధులను వెచ్చించి మొర్సు బావి వద్ద కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయించారు.కల్వర్టు పనులు పూర్తి కావడంతో గ్రామస్తుల్లో హర్షం వ్యక్తం చేశారు.



## దళితుల ఆత్మీయ బంధువు సిఎం రేవంత్ రెడ్డి

**డిసిసి ప్రెసిడెంట్ పున్న కైలాష్ నేత**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** దళితుల ఆత్మీయ బంధువుగా సీఎం రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారని డిసిసి ప్రెసిడెంట్ పున్న కైలాష్ నేత కొనియాడారు.ఆదివారం పట్టణంలోని యాదవ సంఘ భవనంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణకై ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో పున్న కైలాస్ నేత మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో 5 పదవులు దళితులకు దక్కాయని ఎస్‌సి వర్గీకరణతో అణగారిన వర్గాలకు న్యాయం చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి దక్కిందని అన్నారు.దళితుల ఆత్మీయ బంధువుగా సీఎం రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారని దళితులను వంచించిన కేసీఆర్ ను బిఆర్ఎస్ ను ప్రజలు నమ్మబోరని 2029లో తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఉమ్మడి జిల్లా ఎస్‌సి సెల్ సంస్థాగత నిర్మాణ ఇంచార్జీ మందుల సూర్యకిరణ్ మాట్లాడుతూ సంస్థాగతంగా దళిత విభాగం బలంగా ఉందని కాంగ్రెస్ కు అండగా నిలిచేది దళితులేనని



అన్నారు.సామాజిక న్యాయం కాంగ్రెస్ తో సాధ్యమని అన్నారు. త్వరలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా మండల గ్రామ స్థాయిలో నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు బోడ స్వామి, బీసీ సేల్ చైర్మన్ జిల్లా పల్లి పరమేష్,కుర్పటి గణేష్,వేముల గోపి,పేరిక అంజయ్య, పుల్లెంల సందీప్,చింతపల్లి బాలకృష్ణ,సంజయ్, వినోద్, చిరుమర్తి ఉపేందర్, పెరిక హరిప్రసాద్,పగిళ్ల రాజు చర్లపల్లి గౌతమ్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## యువత ప్రతిభతో ఉన్నత స్థాయికి చేరుకోవాలి




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యువత ప్రతిభతో మంచి అవకాశాలు అంది పుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కుంభం ఫౌండేషన్ చైర్పర్సన్ కుంభం కీర్తి రెడ్డి ఆకాంక్షించారు. భువనగిరి న్యూ డైమెన్షన్ స్కూల్ కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ జాబ్ మేళాకు యువత నుండి విశేష స్పందన లభించగా, మొత్తం 1550 మంది అభ్యర్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారుని వారు తెలిపారు. ఈ సందర్భంగా భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కుంభం ఫౌండేషన్ ఛైర్పర్సన్ కుంభం కీర్తి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆశించిన ఫలితాలను సాధించిందని వారు తెలిపారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థుల్లో 480 మందికి ఉద్యోగ నియామక పత్రాలను కుంభం కీర్తి రెడ్డి అందజేశారు. మిగతా అభ్యర్థులకు సంబంధిత హైదరాబాద్ కార్యాలయాల్లో నియామక పత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అలాగే కొంతమంది అభ్యర్థులకు ఫైనల్ రౌండ్ ఇంటర్వ్యూలు కొనసాగుతు న్నాయని తెలిపారు.

## కందాల లక్ష్మి మృతికి ప్రముఖుల నివాళులు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణానికి చెందిన ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి సతీమణి కందాల లక్ష్మి అనారోగ్యంతో శనివారం రాత్రి కన్నుమూశారు.వారి మృతదేహాన్ని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం,మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల,కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లగాటి ప్రసన్నరాజు మాజీ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈకార్యక్రమంలో చిత్రకారుడు సూర్యకుమార్ వివిధ పార్టీల



నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, రాచకొండ వెంకన్న గౌడ్,వంటేపాక వెంకటేశ్వర్లు, ట్రస్మా అధ్యక్షుడు ఎర్ర శంభు లింగారెడ్డి,యానాల కృష్ణారెడ్డి,గుర్రం గణేష్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## బందెల వెంకటయ్యపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** ఈనెల 7వ తేదీన సూరారం గ్రామంలో జరిగిన కోట మైసమ్మ పండుగలో దళితులను బోనాలు పెట్టనివ్వకుండా మహిళలు అని చూడకుండా దుర్భాషలాడుతూ బోనాలు పలకొడుతూ మాదిగలు బోనాలు పెట్టడానికి అనర్హులా అని ప్రశ్నించిన బందెల వెంకటయ్యను సూరారం గ్రామ మాజీసర్పంచ్ భర్త వారి సోదరులు వారి బంధువులు దుర్భాషలాడుతూ దాడి చేసి తీవ్రంగా గాయపరచడం జరిగినది.వెంకటయ్య కుటుంబ సభ్యులను ఎమ్మార్పీఎస్ నాయకులు శివ లింగం మాదిగ తిరుమలేష్ మాదిగలు పరామర్శించి దళితులపై దాడి చేసిన వారిని,వందల మందిలో దళితులు బోనాలు పెట్టకూడదు అని అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసినారు.గ్రామసర్పంచ్ దళితుడు అయ్యుండి దాడి చేసిన వారికి వత్తాసు పలకడం సిగ్గుచేటు అని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.





## అక్షరాలయానికి అండగా దొంగరి మురలయ్య కుటుంబం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** పుట్టిన ఊరు చదువుకున్న బడి రుణం తీర్చుకోవాలన్న సంకల్పంతో అక్షరాలయం అభివృద్ధి కోసం దొంగరి మురలయ్య సుగుణ దంపతులు, వారి కుమారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ ప్రమోద్ కుమార్‌లు దోసపహాడ్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణం కోసం రూ.20లక్షలు విరాళం అందజేశారు. ఆదివారం తరగతి గదుల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. దాతలను ప్రోత్సహించి విరాళాలను సేకరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మామిడి వెంకన్నను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యులను గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వలపట్ల సైదమ్మ లింగయ్య, ప్రధానోపాధ్యాయులు నరసయ్య, ఉపాధ్యాయులు వెంకన్న, నాయకులు దొంగరి యుగేందర్, వరికుప్పల రాము, పంచాయితీ కార్యదర్శి జానీవర్మ, జగన్, సైదులు, అశోక్ పాల్గొన్నారు.

## నేడు చిల్లేపల్లిలో గంగాదేవి జాతర

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండలంలోని చిల్లేపల్లి గ్రామంలో మూసి నది ఒడ్డున గల గంగాదేవి జాతరను ఈనెల 11న అంగరంగ వైభవంగా, సాంప్రదాయ సిద్దంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గంగాదేవి జాతరను గత 7 దశాబ్దాలుగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి యాదవ్‌లు అత్యంత ఘనంగా జాతరను జరుపుకుంటారు. జాతర సందర్భంగా ఆదివారం రాత్రి యాదవులు పసుపు కుంకుమలతో అలంకరించిన మందగంపలను నెత్తిన పెట్టుకుని గుడిచుట్టూ ప్రదక్షిణాలు చేసి సేకరించిన బియ్యంతో కుల పెద్ద రాసి బోజనం ఎత్తుకుని జాతరను ప్రారంభిస్తారు. మిగిలిన వారంతా మేకలు, గొర్రెపోతులతో గుడి చుట్టూ ప్రదిక్షణాలు చేస్తూ స్వామి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ కార్యక్రమంలో పూజారులు జడ వెంకటేశ్వర్లు, జడ గడ్డయ్య, కమిటి సభ్యులు కొండ చిన్నరాములు, కొండపెద్ద వెంకమ్మ, కొండ వెంకటమ్మ, కొండ కృష్ణయ్య, పేరం నర్సయ్య, బోరిగొర్ల పాపమ్మ, పిచ్చయ్య, కొండా సైదులు, కొండ వెంకన్న, రోశయ్యలు పర్యవేక్షిస్తున్నారు.

## సమ్మర్ క్యాంప్ సద్వినియోగం

**ప్రజాపక్షం/ఆలేరు :** వేసవి సెలవులను వృథా చేయకుండా విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరుచుకునే దిశగా శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల వేణుగోపాల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆలేరు మండలంలోని కొలనుపాక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థుల కోసం ప్రత్యేక సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించే లక్ష్యంతో క్యాంపు రూపొందించినట్లు తెలిపారు.

## పేద కుటుంబానికి ఆపన్నహస్తం



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని కరివిరాల గ్రామానికి చెందిన షేక్ సిద్దయ్య ఇటీవల కాలంలో గాలి, దుమ్ము వర్షానికి శిధిలావస్థకు చేరిన ఇల్లుతో ఎక్కడికి వెళ్లాలో తెలియని దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న సమయంలో సామాజిక కార్యకర్త గార్లపాటి మ హేష్‌రెడ్డి మీకు అండగా నేనున్నానని చెబుతూ సిద్దయ్యకు సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. అతిపేద స్థితిలో ఉండి పూటగడవని పరిస్థితిలో ఉన్న సిద్దయ్యకు గత నాలుగు సంవత్స రాలుగా ప్రతినెల 2000 రూపాయలు ఇస్తూ ఆర్థికంగా ఆదుకు న్నాడు. దీంతో మహేష్‌రెడ్డిని పలువురు గ్రామస్తులు అభినందించారు.

## మాతృదినోత్సవ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఒక బిడ్డ ఎదుగుదలలోనే కాకుండా, సమాజ నిర్మాణంలో కూడా తల్లుల పాత్ర వెలకట్టలేనిదని మాతృదినోత్సవం సందర్భంగా తల్లులందరికి మాతృదినోత్సవ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సృష్టికి మూలం అమ్మ, నిస్వార్థమైన ప్రేమకు, సహనానికి నిలువుటద్దం తల్లి అని కొనియాడారు.

## మాతృ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మహాలక్ష్మి మహిళా వృద్దాశ్రమంలో అధ్యక్షులు ఎన్‌విటి, సింగిల్ విండో చైర్మన్ శ్రీశైలం, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్ సభ్యులతో కలిసి మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణకిషోర్, నిరంజన్, కరుణాకర్, ఏటివో ప్రసన్న కుమార్, సంధ్యారెడ్డి, జమీర్, గోపి, శ్రీకాంత్, మల్లేష్, క్రీడాకారులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం



**ప్రజాపక్షం/దేవరకొండ;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి, చైర్మన్‌గా వడ్డెర సామాజికవర్గానికి చెందిన ఆడబిడ్డ మరియు కాంగ్రెస్ పార్టీ సినియర్ మహిళా నాయకురాలు గుంజా రేణుక నారాయణను చైర్మన్‌గా నియమించిన నేపథ్యంలో ఆదివారం వారి నివాసంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్, మరియు నల్గొండ జిల్లా కన్వీనర్ నర్ర బాలు లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన జెరిపోతుల ఐలయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ మబ్బు మహేష్ ఆదివారం ఐలయ్య కుటుంబాన్ని పరామర్శించి, రూ. 5వేలు ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో సోషల్ మీడియా ఇంచార్జీ విక్రమ్‌రెడ్డి, పరశురాములు, మదన్ మోహన్, పరశురాములు, రాజు, శేఖర్, మహేష్, ఉపసర్పంచ్ మహేందర్, నర్సింహా, రవీందర్, నరేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం





**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజలకు అత్యవసర సమయంలో ఆర్థిక బరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నియోజక వర్గ పరిధిలోని 269 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.89,89,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కోదాడ రూరల్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు 32 చెక్కులను అందజేశారు. వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**

**ప్రజాపక్షం/నడిగూడెం:** ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నడిగూడెం గ్రామానికి చెందిన పల్లపు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన కరివిరాల గ్రామానికి చెందిన గుర్రం నీలిమా గాంధీలు ఆదివారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమను జిల్లా కమిటీలో తీసుకున్నందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కోదాడ వ్యవ సాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరప తమ్మ సుధీర్, బూత్కూరి వెంకటరెడ్డి, దున్నా శ్రీని వాస్, నాగేశ్వరరావు, కంభంపాటి సరితచైతన్య పాల్గొన్నారు.

# బేటీ బచావో' నినాదం వట్టి బూటకమే

**ప్రజాపక్షం/ఆలేరు :** మైనర్ బాలికపై బండి భగీరథ్ అత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఈ సంఘటనతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రచారం చేస్తున్న బేటీ బచావో, బేటీ పడావో నినాదం వట్టి బూటకమని తేలిపోయిందని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి రాచకొండ సీత విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆలేరు లో విడుదల చేసిన ప్రకటనలో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, బాలికలు, విద్యార్థినులపై లైంగిక దాడులు, వేధింపులు పెరిగిపోయాయని ఆమె ఆరోపించారు. మహిళా మల్లయోధులపై బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింహ్ వచ్చిన ఆరోపణలు, ఉత్తరప్రదేశ్లో అత్రాస్ ఘటన వంటి అనేక సంఘటనలను ప్రస్తావిస్తూ, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మహిళల భద్రతపై కేవలం నినాదాలకే పరిమితమైందని అన్నారు. బీజేపీ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీర్ప వచ్చిన అత్యాచార ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల అవస్థలు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవ్యవస్థతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ ఆరోపించారు.బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలు,మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సూచనల మేరకు ఆదివారం నకిరేకల్ మండలం టెకులగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు.కొనుగోలు కేంద్రాల్లో నెలరోజులుగా ధాన్యం తూకాలు వేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సరిపడా లారీలు లేకపోవడంతో పాటు బస్తాకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నోముల కేశవరాజు,మాజీ సర్పంచ్ ఏకుల కవి విజయ్, మాజీ ఎంపిటీసీ నాగెల్లి వెంకటయ్య, నోముల సతీష్,కొండ బద్రయ్య,కల్లేపల్లి వెంకన్న, కల్లేపల్లి శ్రీకాంత్,దూదిమెట్ల లింగయ్య,కల్లేపల్లి యాదగిరి,నోముల పాండు తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి కమిటీ అవకతవకలు, రైతుల గోస



**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, లక్ష్మాపురం గ్రామంలోని ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటాలు వేసి ఐదు రోజులు అయ్యి లారీలు రాక,లారీ లోడు కాకా అలాగే ఉన్నాయి. ఇప్పుడు లారీలు వస్తున్న తరుణంలో 5 రోజుల ముందు కాంటా వేసిన ధాన్యం బస్తాలను అలాగే పక్కన పెట్టి వాటి తరువాత కాంటా వేసిన ధాన్యం బస్తాలను లారీలకు ఎత్తించి పంపడం జరిగింది.ఇదేమిటని అడిగిన రైతులకు ఐకేపి కమిటీ సభ్యులు సరైన సమాదానం ఇవ్వడం లేదు.ఏదో పొరపాటున జరిగింది అని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.వరుస క్రమంలో ఎవరి ధాన్యం కుప్పల బస్తాలను లారీలకు ఎత్తించాలో ఐకేపి వాళ్ళే చెబితేనే లారీలకు ఎత్తుతారు.కానీ ఇక్కడ కొందరు రైతులతో ఐకేపి కమిటీ సభ్యులు లాలూచీ పడి ఇలా అవకతవకలకు పాల్పడుతున్నారని రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.



## శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

**ప్రజాపక్షం/మాడ్గులపల్లి:** మండల కెంద్రంలో శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు భక్తిశ్రద్ధలతో, సేవాభావంతో నిర్మించిన ఈ ఆలయం ప్రసిద్ధి చెందుతుందని ఆయన ఆకాంక్షించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు,దాతలను అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,ఆలయ కమిటీ నిర్వాహకులు,వేద పండితులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** పట్టణంలోని డీవీకే రోడ్‌లో గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2011/12 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది.ఈకార్యక్రమానికి పూర్వ విద్యార్థులు,ఉపాధ్యాయులు దాగే,యూసుఫ్,జయసింహా రెడ్డి,మూర్తి, రత్నమాల,పార్వతీ హాజరై తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయులను సన్మానించారు.విద్యార్థుల విజయాలు, పాఠశాల అభివృద్ధిపై చర్చించి,భవిష్యత్తులో పాఠశాలకు సహకారం అందించాలని నిర్ణయించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగి అందరినీ ఆకట్టుకుంది.

## 11 నుంచి సమ్మర్ క్యాంప్

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు మే 11 నుండి 25వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్‌ను కాపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు వస్కుల రామారావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు సృజనాత్మక ఆలోచన పెరుగుతుందని, శారీరక ధృడత్వం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెరుగుతుందన్నారు. విద్యార్థులకు చెస్, క్యారమ్స్, ఆర్ట్, క్రాఫ్ట్, వాలీబాల్ క్రీడల్లో తర్ఫీదు ఇవ్వనున్నట్లు వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం నల్లగొండ మండలంలోని చందనపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన జాల రామలింగయ్య(46) నల్లగొండలో తాపీ మేస్త్రీగా పనిచేస్తు న్నాడని పనిలో భాగంగా ఆదివారం సాయంత్రం సమయంలో మృతుడు రామలింగయ్య తన ఆటోలో నకిరేకల్ నుండి నల్లగొండకు వస్తుండగా చందనపల్లి వైన్స్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుకనుండి వస్తున్న ఆటో అదుపుతప్పి కారును ఢీకొని ప్రమాదం జరిగిందని తెలిపారు.ఈ ప్రమాదంలో జాల రామలింగయ్యకు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడని దీంతో నల్లగొండ రూరల్ ఎస్ఐ డి.సైదాబాబు సంఘటన స్థలానికి చెరుకుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**ప్రజాపక్షం/నడిగూడెం:** తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆదివారం కోదాడ క్యాంపు కార్యాలయంలో నడిగూడెం మండలంకు చెందిన సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరపతమ్మ సుధీర్, బూత్కూరి వెంకటరెడ్డి, దున్నా శ్రీనివాస్, నాగేశ్వర రావు, కంభంపాటి సరితచైతన్య, ధారావత్ వర లక్ష్మి, వెంకటరమణ, కేశగాని సరిత లక్ష్మణ్, గుండు శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనకు ఆహ్వానం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని చెట్లము కుందాపురం గ్రామంలో ఈనెల 13న శ్రీశీతల పరమేశ్వరి, శ్రీకనకదుర్గ పరమేశ్వరి మారెమ్మ గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గ్రామస్తులు, నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొనుగోటి నరేందర్, నాయకులు రాయిరాల సోమయ్య, వాసా వెంకటయ్య, వరకల గడ్డయ్య, గడ్డం శేఖర్, రాయిరాల నాగరాజు, వాసా సంజీవ్ ఉన్నారు.

## నేటి నుంచి విద్యావారోత్సవాలు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల కేంద్రంలోని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్లెప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యావారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి బాలు నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## మృతిచెందిన మిత్రుని కుటుంబానికి సహాయం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన మృతుడు యాట బాలయ్య కుటుంబాన్ని పరామర్శించి,వారి కుటుంబానికి,బాలయ్య పూర్వ విద్యార్థి స్నేహితులు ఆసరాగా 52,500 రూపాయలను సహాయంగా అందచేశారు.ఈ సందర్భంగా తమ తోటి మిత్రుడు మరణించడం బాధాకరమని, వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించి ,వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



# రైళ్లు ఆగేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి




**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట రైల్వే స్టేషన్లో ఎక్స్ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లు ఆగకపోవడంతో చుట్టుపక్కల 5 మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి స్థానిక ఎంపీ,ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు చేయాల్సింది కేంద్ర రైల్వే మంత్రిని కలిసి రామన్నపేటలో నారాయణాద్రి, ఫలక్నామా, గోల్కొండ, పల్నాడు, శబరి, నర్సాపూర్ ఎక్స్ప్రెస్లకు హాల్ట్ ఇప్పించాలి. రైల్వే జోనల్ మేనేజర్కు వినతిపత్రం ఇచ్చి కోవిడ్లో రద్దయిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి. సికింద్రాబాద్ గుంటూరు మెమూ సర్వీస్ కోసం పార్లమెంట్లో ప్రశ్న లేవనెత్తాలి. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైల్వే బోర్డుకు ఒత్తిడి తీసుకురావాలి. అసెంబ్లీలో రామన్నపేట రైల్వే సమస్యను ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. రైల్వే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి స్టేషన్ అభివృద్ధికి నిధులుతెప్పించాలి.శాసనమండలిలో ప్రశ్న వేసి రైల్వే హాల్టుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి. రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఎమ్మెల్సీ నిధుల నుండి కేటాయించాలి. రామన్నపేట, చౌటుప్పల్, వలిగొండ, నారాయణపూర్, చిట్యాల మండలాల 30+ గ్రామాల ప్రజలు ఈ స్టేష్న ఆధారపడ్డారు.విద్యార్థులు,ఉద్యోగులు,నిత్యం హైదరాబాద్ వెళ్లే వందలాది మంది 40 కి.మీ దూరంలోని భువనగిరి, నల్గొండకు వెళ్లాల్సి వస్తోంది. బస్సుల్లో వెళ్తే రూ.80100 ఖర్చు, సమయం వృథా.రైలు ఆగితే రూ.20తో పని అవుతుంది. ఒకప్పుడు తాలూకా కేంద్రం: డివిజనల్ కార్యాలయాలు ఉన్న రామన్నపేటకు రైలు సౌకర్యం కల్పించడం న్యాయం. ఓట్లు వేసి గెలిపించిన మా ఎంపీ, ఎమ్మెల్యేలు మా బాధలు పట్టించుకోవాలి. నియోజకవర్గ పునరుద్ధరణతో పాటు రైళ్లు ఆపడం కూడా చేపట్టాలి.లేఖలు రాయడం కాదు,ఫలితం వచ్చేలా ఢిల్లీ వెళ్లి కొట్లాడాలి అని స్థానికులు కోరుతున్నారు.రామన్నపేట స్టేషన్లో రోజుకు కనీసం 2 ఎక్స్ప్రెస్ రైళ్లు,4 ప్యాసింజర్ రైళ్లు ఆపితే వేలాది మందికి ఊరట కలుగుతుంది. ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా కలిసికట్టుగా పనిచేసి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నిత్యవసర వస్తువులు అందజేత



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట వాస్తవ్యులు గాదె జగన్, తల్లిదండ్రులు అనారోగ్య కారణంతో కాలం చేయడం వలన వారి కుటుంబానికి, మావంతు సహాయంగా చత్రపతి శివాజీ నీర్నెముల యూత్ ఆదివారం వారికి ఒక నెల రోజులకు సరిపడసరుకులు అందించడం జరిగింది. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటే ఆ భగవంతుడు మనల్ని కూడా ఏదో రూపంలో ఆదుకుంటాడని యూత్ సభ్యుల ఉద్దేశం.

## పల్లె విజయ్‌కు చిరుమర్తి జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/నకిరేకల్ :**స్థానిక మున్సిపాలిటీ 17వ వార్డు మాజీ కౌన్సిలర్ పల్లె విజయ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా విజయ్ ప్రజలకు మరింత సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో నకిరేకల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్,కట్టంగూర్ మాజీ జెడ్పిటిసి తరాల బలరాం,నాయకులు గుర్రం గణేష్,రావిరాల మల్లయ్య, సామ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన 10వ వార్డు సభ్యులు పాయిలి బాలరాజు కుమార్తె భార్గవి అరవింద్ ల వివాహం యశోద ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు సర్పంచ్ ఆలకుంట్ల సుధాకర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ పులి పెద్దిరాజు, రాజయ్య, యాదగిరి, శ్రీనివాస్, లక్ష్మ య్య, కిష్టయ్య, సోమయ్య పాల్గొన్నారు.



# యాప్‌లో సాంకేతిక సమస్యలు..

**(మొదటి పేజీ తరువాయి)**

చాలామందికి క్లిష్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు ఈదశలోనే ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది.ఇక 33 ప్రశ్నలు ప్రజల్లో మరో అయోమయానికి దారితీస్తున్నాయి.ఒక్కో ప్రశ్నకు అనేక ఎంపికలు ఉండటంతో ఏది ఎంచుకోవాలో అర్థంకాక చాలామంది మధ్యలోనే ప్రక్రియను నిలిపివేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఇంటి ఫోన్,వంటగ్యాస్,మరుగుదొడ్లు వంటి అంశాలపై సరైన ఎంపిక ఏదో తెలియక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు.స్వీయగణనలో ప్రజలు పొరపాట్లు చేసి ఉంటే గణన అధికారులకు తెలియజేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పరిశీలన సమయంలో అవసరమైన మార్పులు, సవరణలు చేసి వివరాలను సరిచేసే వీలు ఉంటుందని తెలిపారు. అన్ని వివరాలను పునఃపరిశీలించిన అనంతరమే గణన అధికారులు తుది ఆమోదం ఇవ్వనున్నారు.ఇదిలా ఉండగా గణన ప్రక్రియ కోసం ప్రవేశపెట్టిన యాప్‌లో మరికొన్ని సాంకేతిక ఇబ్బందులు కూడా ఉన్నాయని చెబుతున్నారు.సమస్యలను వెంటనే పరిష్కరించి వ్యవస్థను సజావుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



## రామన్నపేట మార్కెట్ యార్డ్‌లో వడ్ల దొంగతనం

**ప్రజాపక్షం /రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలో ఉన్న మార్కెట్ యార్డులో గడకుట్ల మహేష్ వడ్లు పోయడం జరిగినది.మెచ్యూర్ వచ్చి పదిహేను రోజులు అవుతున్న నేటికీ కాంటలు కాకపోవడం ప్రతిరోజు వచ్చి చూస్తూ వెళుతున్నాను.గత మూడు రోజుల క్రితం అనుమానం వచ్చి చూడగా అతని వడ్లలో తేడా కనిపించడం తోటి రైతులను పిలిచి సిబ్బంది దృష్టికి తీసుకుపోవడం ద్వారా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మార్కెట్ యార్డును నమ్ముకుని నమ్మకంతో వడ్లు పోస్తే వడ్ల దొంగతనం జరగడం బాధాకరం. ఐదు నుంచి ఆరు బస్తాలు పోవడం ద్వారా సుమారుగా మహేష్ 5 వేలకు పైగా నష్టపోయినాడు. ఆరుకాలం కష్టం చేసి అప్పులు తెచ్చి పంట పెట్టుబడులు పెడితే ఇటు వడ్లు కొనక అటు తెచ్చిన అప్పు తీరక, ఈ విధంగా దొంగతనాలు జరగడం రైతును తీవ్రంగా కుదించి వేసింది.

## ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం స్కందా లైవ్ లైన్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా 94 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా,76 మందికి రక్తం మూత్ర పరీక్షలతోపాటు ఈసీజీ తీయడం జరిగింది. కొందరిని శస్త్ర చికిత్సలు అవసరం ఏర్పడిందని వైద్యులు తెలిపారు. ఉచితంగా కూడా అవసరమైన మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో క్రిటికల్ కేర్ అండ్ పెయిన్ ఫిజీషియన్,హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొత్త మాసు సోంబాబు,స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ రాగమాళికాదేవి,జనరల్ సర్జన్ డాక్టర్ రూపేష్,హెచ్ ఆర్ మేనేజర్ వి సువర్ణ,మార్కెటింగ్ మేనేజర్ ఆర్ నవీన్ నర్సింగ్ స్టాప్,ఫార్మసీ, ల్యాబ్ స్టాప్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై రెండు పాడి గేదెలు మృతిచెందిన సంఘటన మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం తనకున్న రెండు పాడి గేదెలను మేత కోసం గ్రామ శివారులో పంపించగా అవి మేత మేస్తుండగా కిందకు ఉన్న విద్యుత్ తీగలు వాటి కాలుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన రెండు గేదెల విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్‌లు మృతిచెందిన పాడి గేదెలను పరిశీలించి మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే పాడి గేదెలు విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు తెలిపారు. వెంటనే పాడి రైతు శ్రీనివాస్‌కు ప్రభుత్వం తగిన నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.